



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -5-

సంచలనాత్మకమైన భావాలతో విస్తృమైన సాహిత్య సృజన చేసిన చలం గారి జీవితం ఎలా వుంటుంది? శశిరేఖలోని శశిరేఖా, మైదానం లోని రాజేశ్వరీలాంటి స్వేచ్ఛా ప్రణయాన్ని సదా కోరుకునే మహిళలు కల్పిత పాత్రలేనా లేక అలాంటి పాత్రల్ని చలం గారు నిజంగా చూసారా? అలాంటి మహిళలు చలం గారి జీవితంలోకి ప్రవేశించారా? ఒకవేళ ప్రవేశించి వుంటే, ఆ సమయాల్లో వారి కుటుంబ సభ్యులు ఎలా స్పందించేవారు? అసలు చలం గారికి స్త్రీల పట్లా,పసిపిల్లల పట్లా ఒక విధమైన ప్రత్యేకమైన శ్రద్ధ కలగడానికి ఆయన బాల్యంలో ఎలాంటి సంఘటనలు కారణం అయ్యాయి? బిడ్డల శిక్షణ గురించి ఎంతో దయార్ద్ర హృదయం తో రాసిన చలం గారు తమ పిల్లల్ని ఎలా పెంచారు? ఆయన ఉద్యోగాలు చేసేటప్పుడు అందరితోనూ వివాదాలు రావడానికి కారణం ఏమిటి? ఎక్కడకు వెళ్ళిన సంఘ బహిష్కరణలకు గురయ్యేటంతటి అపచారాలు ఏం చేశారు? ఆయనలోని ఏ ఆకర్షణ లక్షలాది మంది అభిమానుల్ని ఈరోజుకి కూడా నిలబడేలా చేసింది? ఆయనలోని ఏ వికర్షణ ఇప్పటికీ ఆయనలోని సాహిత్యాన్నీ, జీవితాల్ని కూడా విమర్శలకు గురి చేస్తున్నది?

ఇంకా అనేకానేక ప్రశ్నలకు సమాధానం ఆయన స్వీయ చరిత్రలోనే దొరుకుతాయి. ఒక్కటి మాత్రం నిజం. చలంగారు విశిష్ట వ్యక్తీ, విశిష్ట రచయితా. ముఖ్యంగా నూటికి నూరు శాతం నిజాయతీ వున్న రచయిత, మన సాహిత్యం లో అత్యంత అరుదుగా తారస పడుతుంటారు. చలంగారు ఊహ తెలిసిన దగ్గరనుండి 55 సంవత్సరాలు వచ్చే వరకూ అంటే 1951 వరకూ ఆయన జీవితం నిత్య సంఘర్షణ. ఆ సంఘర్షణ లోనుండి పుట్టినదే ఆయన సృష్టించిన సాహిత్యం. అదొక ఉధృతమైన ప్రవాహం లాంటిది. ప్రవాహం అని ఎందుకన్నానంటే, అందులో ఎన్నో పిల్లకాలువలున్నాయి. ఉప నదులున్నాయి. జలపాతాలున్నాయి. పెను తుఫానులున్నాయి.

చలంగారి జీవిత విశేషాలు తెలుసుకుంటున్నప్పుడు ఆయన గురించీ, ఆయన కుటుంబ సభ్యుల గురించే కాకుండా, ఆయనతో వివిధ సందర్భాలలో కలసి నడచిన, నడిచి విడిపోయిన ఎన్నో మిత్ర బృందాలు ఎదురవుతూ వుంటాయి. అసలు చలం గారి జీవితమే అత్యంత సంక్లిష్టమైన సమీకరణం. ఈ విశేషాలన్నీ సాధికారంగా తెలుసుకోవడానికి ఒకేఒక్క సాధనం, ఆయన చెప్పుకున్న స్వీయచరిత్ర. సాధారణంగా స్వీయచరిత్ర అంటే, వాళ్ళ జీవితాల్లో విజయాల గురించీ, సంతోష సమయాల గురించీ, వాళ్లకు పరిచయమైనా ప్రముఖుల గురించీ ఇలా తమ గురించి తాము గొప్పగా చెప్పుకోవడానికి లేదా సానుకూలంగా పరిచయం చేసుకోవడానికీ రాస్తుంటారు. తమ జీవితంలో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించీ, కష్టాల గురించి రాసేవాళ్ళు తక్కువ. ఇంకో స్థాయి ముందుకు వెళితే, తమ బలహీనతల గురించీ, ఆ బలహీనతలకు లోనై తాము చేసిన పొరపాట్ల గురించీ, ఇతరులను బాధ పెట్టిన సంఘటనలను ఇలా...కాస్త నెగిటివ్ అనిపించే ఆత్మకథలు తక్కువగా ఉంటాయని అనుకోవడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

చలం గారి స్వీయచరిత్ర సరిగ్గా అలాగే వుంటుంది. ఇంకా మినహాయింపుగానే వుంటుంది. అంటే ఆయన స్వీయచరిత్రలో ఆయన ఎదుర్కొన్న కష్టాలనీ, చేసినటువంటి పొరపాట్లనీ, తన పొరపాట్ల వలన ఎవర్ని ఇబ్బంది పెట్టానో..ఇలాంటివన్నీ కూడా చాలా నిజాయతీగా, ఇన్ హిబిషన్, హిపోక్రసీ లేకుండా స్పష్టంగా రాసుకున్నారు. ఎవరో అడిగారట "ఏమండీ! మీ ఆత్మకథ నిండా డెబిట్ లే రాసుకున్నారు. క్రెడిట్ లు ఏమీ రాసుకోలేదు."అని. అయితే, ఎప్పుడైనా గానీ, చేసిన పనులు చెప్పుకోవడానికి భయపడలేదు. అదే ధోరణి ఆత్మకథలో కూడా కొనసాగించారు. అయన ముందు మాటలో ఇలా రాసుకున్నారు.

"ఆత్మకధలంటే నాకు అసహ్యం. ఆత్మకథ రాయడమంటే తాము లోకానికి ముఖ్యమైన మనిషయినట్లూ, తానేదో ప్రపంచానికి తీరని ఉపకారం చేసినట్లూ, తన సంగతి లోకానికి చెప్పకపోతే, తన గొప్ప లోకానికి తెలియనట్లూ, తెలియకపోతే లోకానికి నష్టమైనట్లూ అనుకుంటున్నా డన్నమాట. అసలు ఎందుకు పుట్టానా? పుట్టినవాడిని చప్పున చావక ఎందుకు ఇంత కాలం సరౌండింగ్ ని ఇంత కల్మషం చేశానా? అనుకొనే నావంటి వాడు తన కథని సిగ్గు లేకుండా చెప్పుకున్నాడంటే, అది ఏమాత్రం క్షమింపదగిన విషయం కాదు. అయినా ఆపని జరుగుతోందంటే, ఏదీ మన చేతుల్లో లేదు. పైగా నాకు ఇప్పుడు కళ్ళు కనపడవు. నా చెయ్యి నా కలం పట్టుకోలేదు. నా చెయ్యే నా మెదడు. నా వేళ్ళ లోనుండి తప్ప నా ఆలోచనలు పలకవు. నేను అనుకున్నది అక్షరాల్లోకి రావడం లేదు. అయినా ఈ పుస్తకం తయారవుతోంది. దీనికి ఇమీడియట్ కాజ్ విశ్వం. ఇతను శెలవు పెట్టి కూర్చొని, సౌరీస్ ను ఎంకరైజ్ చెయ్యడం.అటు తర్వాత నర్తకి ఇన్నోసెంట్ గా చూడవచ్చిన భారతిని పట్టుకొచ్చి, ఈ పనిలో ప్రవేశపెట్టడం, ఆ భారతి ఈ పనికోసమే పుట్టినట్లు, తన ఏకైక బాధ్యత అన్నట్లు, ఈ పని పూర్తి చెయ్యడం, ఆమె ప్రారబ్ధం అని తప్ప ఇంకే విధంగా యోచింప లేను.

-- అరుణాచలం ..1972 డిసెంబర్ 30.

ఇవి చలంగారి ఆత్మకథ లోని ముందు మాట లోని కొన్ని మాటలు. ఇందులోని పేర్లు ఎవరెవరివో చెబుతాను. 'ఇమీడియట్ కాజ్ విశ్వం' అన్నారు కదా! విశ్వం అంటే చలంగారు పెంచుకున్న అమ్మాయి అల్లుడు. అంటే మనవరాలి భర్త. ఈ వివరాలన్నీ తరవాత వస్తాయి. ఈ స్వీయచరిత్రని 1972లో ఆయన డిక్టేట్ చేయించి రాయించారు. ఆ తరువాత 4 సంవత్సరాలకి పక్షవాతం వచ్చింది. 1979లో మరణించారు. అలాగే సౌరీస్ అంటే చలంగారి పెద్దమ్మాయి. నర్తకి అంటే చలంగారు పెంచుకున్న అమ్మాయి.

చలం గారి స్వీయచరిత్ర యదాతథంగా చదివితే సరిగ్గా అర్థం కాకపోవచ్చు. ఎందుకంటే, దీనిలో కొన్ని ఇబ్బందులున్నాయి. ఆయన రాసిన సంఘటనలన్నీ కూడా ఒక వరసలో వుండవు. అలాగే కొంతమంది పేర్లు షార్ట్ కట్ రూపంలో వుంటాయి. అంటే 'చే' అనీ, చిట్టీ, ఒయ్యా, ఉవ్వీ ఇలా రాస్తారు. ఆ పేర్లు ఎవరెవరి గురించి రాస్తున్నారో ఒక 'డీకోడర్' కావాలి. అందుకని చలంగారి జీవిత విశేషాలుఅన్నిటినీ ఒక క్రమంలో మీ ముందుకు తీసుకురావడానికి చాలా కసరత్తులు చేయాల్సి వచ్చింది. ఇది రాయడానికి చలం గారి ఆత్మకథే ఆధారం అయినప్పటికీ మరికొన్ని పుస్తకాలు కూడా అవసరమయ్యాయి.ఆయన ఆత్మకథ తో పాటుగా నేను ఆధారంగా తీసుకున్న మరికొన్ని పుస్తకాలగురించి చెప్పడం నా ధర్మం.

★1958లోనే [చలం గారి ఆత్మకథ రావడానికి ముందే] గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు[ఈయనది ఘంటసాల గ్రామం]రాసిన "చలం జీవితం–సాహిత్యం " అనే పెద్ద పుస్తకం రాశారు.అందులో చలం గారి జీవితానికి సంబంధించిన కొన్ని విశేషాలు రాశారు. కరెక్ట్ గా చెప్పాలంటే, చలం గారి గురించీ, ఆయన జీవిత విశేషాల గురించి వచ్చిన మొట్టమొదటి పుస్తకం. ఇది చాలా ఖచ్చిత మైన సమాచారం అని ఎలా చెప్పవచ్చంటే 1958లో గొర్రెపాటి రాసిన దానికీ, చలంగారి స్వీయచరిత్రకీ యదాతధం గా సరిపోతాయి.

★1983 లో పురాణం సుబ్రహ్మణ్యం గారు రాసిన "ఆంధ్రాలో చలం". మొత్తం ఆయన 3పుస్తకాలు రాశారు.అందులో "ఆంధ్రాలో చలం "లో ఎక్కువ విశేషాలు రాశారు.

★"ప్రేమకు ఆవలి తీరం" ఇది అంపశయ్య నవీన్ రాశారు. ఇది నవల రూపంలో వుంటుంది.

★చలంగారి చెల్లెలు మనవరాలు తురగ జానకీరాణి గారు "నేనూ– మా తాతయ్య" అనే పుస్తకం.

ఇవి కాక, చలం గారి జీవిత విశేషాలు అక్కడక్కడ వుంటాయి. అలాగే మ్యుజింగ్స్, ప్రేమ లేఖలూ, ఇతరులకు రాసిన ఉత్తరాలూ ఇంకా ఇతర పుస్తకాల్లోనూ వుంటాయి.

ఈ పుస్తకాలే కాకుండా వీటిల్లో వున్న లాజిక్కులు కరెక్ట్ చేసుకోవడానికని ప్రస్తుతం చలం సాహిత్య ప్రచురణకూ, చలం సాహిత్య వ్యాప్తికీ, కృషి చేస్తున్న ప్రముఖులు కొంతమంది తో సంప్రదించి, డైరెక్ట్ గా మాట్లాడాను. వాళ్ళు ఆళ్ళ గురుప్రసాదరావు గారు. ఉదయ్ కుమార్ గారు. డా.వావిలాల సుబ్బారావు గారు, అంపశయ్య నవీన్ గారు. హైదరాబాద్ లో వుండే వత్సల గారు. భీమిలి స్నేహ కుటీర్ లో వుండే రాజా రాంబాబు గారు. గత ముప్పయి సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా భీమిలి ఆశ్రమంలో ఒక నెల రోజుల పాటు వుండే తిరుపతి మిత్రులు సుబ్బనాచారి గారు. ఇంకా యామిజాల జగదీష్ గారు.వీళ్ళందరితో మాట్లాడితే చాలా విలువైన సమాచారం ఇచ్చారు. ఇంకా నామిత్రులు వంశీగారు,గొల్లపూడి మారుతీరావు గారు. వీళ్ళందరికీ నా తరపునా, మీ తరపునా కృతజ్ఞతలు. అన్నిటినీ ప్రామాణికంగా తీసుకొని ఒక క్రమంలో పెట్టి మీకు అందిస్తున్నాను.ఇక చలం గారి జీవిత విశేషాల్లోకి వెళదాం.....

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

సుదీర్ఘమైన, అలాగే చాలా సంక్లిష్టమైన, సువిశాలమైన చలంగారి జీవిత విశేషాలను తెలుసుకోవాలంటే దశల వారిగా తెలుసుకోవాలి. మొదటి దశ బాల్యం, హైస్కూలు.

చలంగారి అసలు పేరు కొమ్మూరి వెంకటచలం. తాతగారు దత్తత తీసుకోవడం వలన గుడిపాటి వెంకట చలం అయ్యారు. చలంగారి నాన్నగారి పేరు కొమ్మూరి సాంబశివరావు. ఇతను డిటెక్టివ్ నవలలు రాసిన కొమ్మూరి సాంబశివరావు కాదండి. ఈ కొమ్మూరి, గుడిపాటి వీళ్ళ వంశ చరిత్రను కాస్త వెనక్కి వెళ్లి చూస్తే.. ఈ కొమ్మూరి వాళ్ళది ఇంటి పేరు మొదట్లో 'గంగరాజు' అట. అయితే, వాళ్ళు గుంటూరు దగ్గర వుండే 'కొమ్మూరు'అనే వూర్లో వుండి, వివిధ ప్రదేశాలకు వలసలు వెళ్లి స్థిర పడడం తోటి, ఆ ఊరినుండి వచ్చారు కాబట్టి వాళ్ళను 'కొమ్మూరి' అనేవాళ్ళు. అలా అలవాటై, అదే ఇంటి పేరుగా స్థిర పడింది. ఎప్పుడో శతాబ్దాల క్రిందట, మొదట కాకినాడ వెళ్లారు. తరువాత తెనాలి వెళ్లారు. అలాగే గుడిపాటి వారు. వాళ్ళది గుడివాడ దగ్గర వెంకటాపురం. వాళ్ళుకూడా ఉద్యోగ రీత్యా వివిధ ప్రదేశాలకు వెళ్లారు. చలంగారి తాతగారు గుడిపాటి వెంకట రామయ్యగారు. ఆయన సర్వే డిపార్ట్ మెంటు లోనూ, సెటిల్ మెంట్ డిపార్ట్ మెంటు లోనూ పనిచేసేవారు. ఆయనకు బ్రిటీష్ గవర్నమెంట్ లో చాలా పేరు వుండేది.'దివాన్ బహదూర్' అనే పదవో లేకపోతే బిరుదో వుండేది. బాగా ధనవంతులు. ఆ రోజుల్లో అద్భుతమైన మేడ తెనాలిలో కట్టుకున్నారు. ఆ మేడ కట్టేటప్పుడు మద్రాసు లాంటి దూర ప్రదేశాలనుండి కాంట్రాక్టర్లను తీసుకువచ్చి,చాలా ఆధునాతనంగా నిర్మించుకున్నారు. ఇదంతా 1900 ప్రాంతాలలో.

గుడిపాటి వెంకటరామయ్య గారు చాలా దాన ధర్మాలు చేస్తుండేవారు. పండితులు ఆయన దగ్గర సన్మానాలు కూడా పొందుతుండేవారు. ఒక విధంగా చెప్పాలంటే, పిల్ల జమిందారు లాగా వుండేవారు. కాకపోతే ఆయనే ఒక జమిందారు దగ్గర పనిచేస్తుండేవారు. ఆ వెంకటరామయ్య గారికి వెంకట సుబ్బమ్మ అనే ఆడపిల్ల. ఆమెను కొమ్మూరి సాంబశివరావు అనే అతనికిచ్చి వివాహం చేశారు. వీళ్ళ మొదటి సంతానమే మనం మాట్లాడుకుంటున్న వెంకటచలం. ఆయన 1894 మే 19న జన్మించారు. ఆయన జన్మించింది మద్రాసులో. మద్రాసులో ఎందుకు జన్మించారు అనేదానికి సరైన కారణం తెలియదు. బహుశా వాళ్ళ తాతగారు ఉద్యోగ రీత్యా అక్కడ వుండడం వలన వెంకట సుబ్బమ్మ గారు అక్కడకు వెళ్లివుంటారు అనుకోవచ్చు. చలంగారి పుట్టినరోజుకి ఒక ప్రత్యేకత వుంది. అది వైశాఖ పౌర్ణమి. ఇప్పటికి కూడా ఆ వైశాఖ పౌర్ణమి రోజున భీమిలిలో ఆయన పుట్టిన రోజున ఉత్సవం చేసుకుంటారు. అది బుద్ధ జయంతి కూడా. అంటే, బుద్ధుడు పుట్టిన రోజునే చలంగారు జన్మించారు. బుద్ధుడు ప్రచారం చేసింది ఒక రకమైన సిద్ధాంతం. చలం గారిది వేరే సిద్ధాంతం.

చలం గారి నాన్నగారు బాగా చదువుకున్నారు గానీ, వుద్యోగం ఏమీ చేసేవారు కాదు. అతను ఎప్పుడూ తన మామగారి ఇంట్లోనే ఉండేవాడు. చలం గారి తాతగారు వెంకట రామయ్య గారు క్రిష్ణాజిల్లా లోని

'తోట్ల వల్లూరు' అనే వూరు జమిందారు గారి దగ్గర రిసీవరుగా పని చేస్తుండేవాడు. విజయవాడ నుండి దివి తాలుకా లోని అవనిగడ్డ వెళుతుంది క్రిష్ణానది. ఆ నదికి ఒక వైపు క్రిష్ణాజిల్లా, మరోవైపు గుంటూరు జిల్లా వుంటాయి.ఆ నదీ తీర ప్రాంతంలో ఉన్నదే తోట్ల వల్లూరు. చలం గారి బాల్యం అంతా కూడా ఆ తోట్ల వల్లూరు లోనే గడచింది.

చలం గారి మేడ ఎదురుగుండానే జమిందారు గారి భవంతి వుండేది. పెద్ద పెద్ద గదులూ, ఏనుగులూ, గుర్రాలూ ఇలాంటి వన్నీ కనిపిస్తుండేవి. చలంగారు చిన్నప్పుడు ఎక్కడికైనా వెళ్ళాలంటే, ఏనుగు మీదనో, గుర్రం మీదనో వెళ్ళ గలిగే అంత సౌభాగ్యం వుండేది వాళ్ళ తాత గారి ద్వారా. అంతే కాకుండా నదీ తీరంలో వూర్లో పెరగడం వలన, నదికి వరదలు వచ్చినపుడు నదికి పూజలు చెయ్యడం లాంటివి చూస్తూ పెరిగారు. చలం గారికి 5,6 సంవత్సరాలు వయసులో ఆయన తాత గారు జమిందారు గారి దగ్గర పదవీ విరమణ చేసి తెనాలి వెళ్లారు. ఆ తెనాలిలో పెద్ద బంగాళా కట్టించుకున్నారు.  ఆ బంగాళా ముందు పెద్ద తోట.ఆవులూ, దూడలూ ఉండేవి. చలం గారికి వూహ వచ్చాక తాత గారి ఇంట్లో అలా ప్రారంభం అయింది బాల్యం.

వాళ్ళ నాన్నగారు కూడ అక్కడే వుండేవారు. ఆయనొక విచిత్రమైన వ్యక్తి. 'వుద్యోగం ఏదైనా చెయ్యమంటే, భార్యను తీసుకొని వెళ్ళిపోతాడేమోనని అలా వెళ్ళిపోతే, కూతురు ఎక్కడ ఇబ్బంది పడుతుందో' నని ఏమీ అనేవారు కాదు వెంకట రామయ్య గారు. ఆయనకు మగ పిల్లలు లేరు. అందుకని అతని మరణాంతరం 'కర్మలు' లాంటివి చెయ్యడానికి మగ పిల్లలు వుండాలని తన మనవడ్నిఅంటే చలం గారిని దత్తత తీసుకున్నారు.అలా దత్తత తీసుకోవడం వల్ల "గుడిపాటి వెంకట చలం" అయ్యారు.

చలంగారికి చిన్నప్పటినుండీ  ఆరోగ్యం సరిగ్గా ఉండేదికాదు. మైగ్రేన్ లాంటిది వుండేది. ఎప్పుడూ బద్ధకంగా వుండడం, ఏ పనీ చెయ్యాలనిపించకపోవడం ఇలాంటివన్నీ ఉండేవి. అన్నిటికీ మించి చలంగారు తన బాల్యం గురించి చెప్పుకున్నప్పుడు ఆయన ప్రస్తావించుకున్నది వాళ్ళ నాన్న గురించి. అదేదో పితృ ప్రేమ లాంటిది ఏమీ కాదు. మొట్టమొదటి జ్ఞాపకం 5 ఏళ్ళున్నప్పుడు వాళ్ళ నాన్న కొట్టడం. రెండో జ్ఞాపకం ఆయన కొట్టడం. మూడో జ్ఞాపకం మళ్ళీ కొట్టడం. ఎప్పుడూ కొడుతూ ఉండేవాడు. ఎందుకు అంటే, ఆయనది ఒక ప్రత్యేకమైన స్వభావం. చలంగారు ఆత్మకథ రాసుకున్నది 78 ఏళ్ళ వయసులో కదా! ఆ వయసులో కూడా వాళ్ళ నాన్న గురించి రాసుకున్నప్పుడు

"మా నాన్న మీద ద్వేషం జీవితమంతా నిలిచిపోయింది. ఈనాటి వరకూ ఆయనను "నాన్నా!"అని గానీ, ఇంకేమైనా గానీ పిలిచి ఎరగను.ఆయనంటే నాకు అంత అసహ్యం." అని రాసుకున్నారు.ఆయన

యెంత కొట్టినా “చాలు” అని గానీ, ఆయన కొడుతూవుంటే, ఫలానా పని చెయ్యొద్దూ అంటే.. “చెయ్యను “అని గానీ అనేవారు కాదట. ఈ కుర్రవాడు ఏమీ మాట్లాడడం లేదని మరింతగా కొడుతుండేవాడు. చలం గారి చిన్నతనంలో అంత ద్వేషాన్ని నింపారు వాళ్ళనాన్న. చలం గారు జీవితాంతం అనేక వ్యవస్థలతో పోరాడారు. అనేక ఆచారాలతో పోరాడారు. అనేక వ్యక్తులతో సంఘర్షించారు. కానీ...ఆయన పోరాడలేని ఒకే ఒక వ్యక్తి. వాళ్ళ నాన్న. చిన్నతనంలో ఎలా భరించారో, వయసు వచ్చాక కూడా ఆస్తి తీసుకోవడానికి వాళ్ళ నాన్న చేసినటువంటి ప్రయత్నాలు అడ్డుకోలేదు. అలా వాళ్ళ నాన్న దెబ్బలతో మొదలయ్యింది చలం గారి బాల్యం.

అలా కొడుతూ వున్నప్పుడు అనుకునేవారట ‘ నాకో తమ్ముడో, చెల్లెలో వుంటే వాళ్ళతో ఆడుకుంటూ వుంటేఇంత బాధ వుండదు కదా! తప్పించుకోవచ్చు’ అని. అందుకని ఇంటికి దగ్గరలో వున్న ఏదో గుడి వుంటే అక్కడకు వెళ్లి “నాకో తమ్ముడు వుంటే చూడు” అని దణ్ణం పెట్టుకునేవారట. తరువాత ఆయనకు నలుగురు తమ్ముళ్ళూ, నలుగురు చెల్లెళ్ళూ పుట్టారు. అయితే మిగతా వాళ్ళు పుట్టిన తరువాత కూడా వాళ్ళ నాన్న కొట్టడం మానలేదు. వాళ్ళ నాన్న చలం గారినే కాదు, తమ్ముళ్ళని కూడా కొడుతుండేవాడు. ఆ దృశ్యాలను చలంగారు దూరం నుండి చూసి ఏడవడమే తప్ప ఏమీ చేసేవారు కాదు. “తమ్ముళ్ళని కొడుతూ వుంటే నేను వెళ్లి ఎందుకు అడ్డు పడలేక పోయాను”అని ఆత్మకథ లో రాసుకున్నారు. ఆ తమ్ముళ్లలో ఒకాయన కొమ్మూరి వెంకటరామయ్య గారు. ఆయన భార్య పేరు కొమ్మూరి పద్మావతి దేవి. ఈ కొమ్మూరి పద్మావతి దేవి గారు “రైతు బిడ్డ” సినిమాలో ప్రధాన పాత్ర పోషించారు.

ఆ రోజుల్లో కుటుంబంలోని స్త్రీలు నాటకాలు వెయ్యడం గానీ, సినిమాల్లో వెయ్యడం గానీ చేసేవారు కాదు. సినిమాల్లోకి వెళ్ళడం ఈ కొమ్మూరి పద్మావతి దేవిగారి తోనే మొదలైంది . వీళ్ళ పిల్లల్లో పెద్దావిడ పేరు “వరూధిని”ఈమె కొడవటిగంటి కుటుంబరావుగారి భార్య. రెండో సంతానం కొమ్మూరి సాంబశివరావు. వాళ్ళ తాతగారి పేరు పెట్టారు. ఇతనే డిటెక్టివ్ నవలలు రాసిన కొమ్మూరి సాంబశివరావు. మూడో సంతానం కొమ్మూరి ఉషారాణి. “ఉషా రాణి భాటియా “ అనే పేరుతోఈమె కూడా కథలు రాస్తుండేవారు. డిల్లీ నేషనల్ బుక్ ట్రస్ట్ లో పని చేసేవారు. ఇంకా వీళ్ళే కాకుండా చలం గారి తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ వాళ్లకు సంబందించిన సంతానం, ఇలా అందర్నీ చూసుకుంటే... వక్కలంక సరళ, వక్కలంక పద్మ, సినీ నటి పూర్ణిమా, స్వప్న సుందరి అనే నర్తకీ, తురగా జానకీ రాణి వీళ్ళందరూ కూడా చలం గారి కుటుంబాల్లో నుండి వచ్చినవారే.

చలం గారి నాన్న గారి గురించి ఆసక్తికరమైన విషయాలు ఏమిటంటే...ఆయనకు లేని వ్యసనం అంటూ లేదు. ఏ పనీ చేస్తుండేవాడు కాదు."సరే! ఇంట్లోనే పడుంటాడు లే !"అని అతని మామగారు ఇంట్లోనే ఉంచుకున్నారు. ఆయన ఎన్ని విచిత్రమైన పనులు చేసేవాడంటే, తెనాలిలో వున్నప్పుడు ఇంకా అక్కడ పరిచయం లేని గ్రామఫోన్, మోనోగ్రామ్ ఇలాంటి వన్నీ తెప్పించి అక్కడ వాళ్లకు అమ్మేవాడు. కానీ, డబ్బులు మాత్రం వసూలు చేసేవాడు కాదు. అతనికి డబ్బులు ఖర్చు పెట్టడమే తప్ప, సంపాదన గురించి ఏ మాత్రం పట్టించుకునేవాడు కాదు. అయితే అతను తన పిల్లల్ని కొట్టేవాడు గానీ, వాళ్ళ పిల్లల్ని మాత్రం ప్రేమగానే చూసేవాడట. చలం గారి పిల్లలు ఎప్పుడైనా తెనాలి వస్తే, వాళ్ళకోసం మామిడి పళ్ళ బుట్టలు తెస్తుండేవాడట. అతనికి ఆయుర్వేదం కూడా తెలుసు. ఒకసారి ఏదో మోటారు సైకిలు ప్రమాదంలో కాలు విరిగితే, దాదాపు 6 నెలలు గదిలోనే వుండిపోయి, సొంత వైద్యం చేసుకుని, నడచుకుంటూ బయటకు వచ్చాడట. అలాగే ఒకసారి టాన్సిల్స్ అని డాక్టర్ చెబితే, ఆయనే స్వయంగా బ్లేడుతో కోసుకొని నయం చేసుకొన్నాడట. వీటిల్లో నిజం ఎంతో తెలియదుగానీ, అతను విలక్షణమైన వ్యక్తి అని చెప్పడానికి వీటిని కథలుగా చెబుతారు. తన తాగుడు కోసం, భార్య నగలు అమ్మడం, చివరకు చలం గారికి హక్కుగా రావలిసిన ఆస్తిని, చలంగారి అమ్మగారి ద్వారా స్వాహా చెయ్యడం కూడా చేశాడు.

ఒకసారి ఆయన మీద ఒక అపవాదు కూడా వచ్చింది. ఎవరో ఒకాయనకి టి.బి. వస్తే, నయం చేయించడానికని మద్రాస్ తీసుకువెళ్ళాడట. ఆ టి.బి. వచ్చినతను చనిపోయాడట. ఆయన దగ్గర వున్న ఆస్తి నంతా చలంగారి నాన్న కొట్టేసాడనే అపవాదు కూడా వచ్చింది. ఇన్ని కథల మధ్యన ఉండేవాడు చలం నాన్న, ఒక పక్కన చలాన్ని కొడుతూ.

ఆ విధంగా ఒక పక్క చలంగారి ఆరోగ్యం బాగోలేకపోవడం, మరో పక్క వాళ్ళ దెబ్బలు. వీటి మధ్య తన బాధలే కాకుండా వాళ్ళ అమ్మగారి బాధలు కూడా చూస్తూ పెరిగారు. చలం గారితో కలసి ఆమెకు మొత్తం 9 మంది సంతానం. ఆమె ఒకోసారి "నేను చచ్చిపోతాను" అంటుండేదట. అయినా వాళ్ళ నాన్న వదిలిపెట్టే వాడు కాదట. ఇంత మంది పిల్లల్ని సముదాయించడానికి ఆమె జోల పాట పాడితే, ఒకరిద్దరు పడుకునేవారు. మిగతా వాళ్ళు ఏడుస్తూ వుండేవారు. ఆమె నిస్సహాయంగా అనేదట."ఏం చెయ్యనురా..ఇంకా పడుకోవు"అని ఏడుస్తూ వుంటే, చలం గారు ఒక పక్క మూగగా, ఏడ్చేవారట. "ఈనాటి తల్లుల మల్లే ఆ పసిపిల్లల్ని కొట్టేది కాదు." అని వాళ్ళ అమ్మగారి గురించి రాసుకున్నారు. వాళ్ళ అమ్మగారు పడుతున్నటువంటి బాధలన్నీ చూసి , చలం గారు చిన్నప్పుడు 4 నిర్ణయాలు తీసుకున్నారట.

1.ఎప్పటికీ పెళ్లి చేసుకోకూడదు. 2. ఒకవేళ పెద్దవాళ్ళ బలవంతాన పిల్లల్ని కనకూడదు. 3. పిల్లల్ని కన్నా వాళ్ళను యేడిపించ కూడదు. 4. పిల్లలు ఏడ్చినా, ఏమైనా సరే! కొట్టకూడదు. ఈ 4 నిర్ణయాలు తీసుకున్నారు గానీ, మొదటి రెండూ జరగలేదు. కాకపోతే పిల్లల్ని ఏడిపించకుండా, కొట్టకుండా పెంచారు. అలాగే పెంచాలని పుస్తకాల్లో రాశారు. చిన్నప్పటి నుండి కూడా చలంగారికి దైవ భక్తి చాలా ఎక్కువగా వుండేది. దానికి కారణం ఏమిటంటే, వాళ్ళ అమ్మమ్మ గారు చుట్టుపక్కల వున్న అందరినీ పిలిచి భారతం, భాగవతం లాంటివి చదివి చెబుతుండేవారు. చిన్న పిల్లాడిగా వున్న చలం గారు, వాళ్ళ నాన్న దెబ్బల నుండి రక్షించుకోవడానికి వాళ్ళ అమ్మమ్మ గారి దగ్గరకు వెళ్లి, కూర్చొని, ఆ పురాణాలు వింటుండేవారు. అదయిపోగానే ఎప్పుడు దొరుకుతాడా..కొడదామా అని వాళ్ళ నాన్న చూసేవాడు.

దొరికినప్పుడల్లా పట్టుకొని "ఎందుకురా? పురాణాలు వింటున్నావు?నువ్వేమైన పురాణాలు చెప్పుకొని బతుకుతావా?"అని ఇంకో నాలుగు దెబ్బలు ఎక్కువ వేస్తుండేవాడు. ఆయన ఏం రాసుకున్నారంటే..."నిజంగా అలా పురాణాలూ చెప్పుకుంటూ బతికినా బాగుండేది. కానీ, అది కుదరలేదు నా జీవితంలో" అని. వాళ్ళ అమ్మమ్మ గారు ఆమె పురాణాలూ చదవడమే కాకుండా, వాళ్ళింటికి ఎవరో పండిత శాస్త్రి గారు మధ్యాన్నం పూట సంస్కృతంలో వున్న పుస్తకాలని తెలుగులో చెబుతుండేవారు. అందరితో పాటు చలంగారు కూడా వినేవారు.

ఇవన్నీ వినడం మూలాన బాగా చిన్న తనంలోనే అంటే 7,8 సంవత్సరాల వయసులోనే దైవ భక్తి అప్రయత్నంగానే వచ్చింది. ఈ దేవుళ్ళలో కూడా ఆయనకు ఇష్టమైన దేవుడు విష్ణువు. అందుకని ఏదో రూపంలో విష్ణువుకి పూజలు చెయ్యాలని, వాళ్ళ అమ్మమ్మ దగ్గర అణాయో, కానీయో తీసుకొని చిన్నచిన్న రాళ్ళ మధ్యలో ఏదో చిన్న విష్ణువు విగ్రహం పెట్టి, వాటికి పూజలు చేస్తుండేవాడు. హారతీ, కర్పూరం, ఖర్జూరం లాంటివి కూడా పెట్టేవాడు. ఆ చిన్న గుడి ఆయన కోసమే వుండేది. వాళ్ళ నాన్న కొట్టినపుడల్లా అక్కడకు వెళ్లి ఏడుస్తూ ఉండేవాడట. ఇలా చిన్న తనంలోనే దైవ భక్తిని పెంచుకున్న చలం గారికి ఇంకా చిన్నతనంలోనే ఉపనయనం చేశారు. ఉపనయనం చేశాక, శ్రద్దగా  సంధ్యావందనం చేయడం, సంధ్య వార్చడం ఇలాంటివన్నీ చేస్తుండేవారు.

ఆయనకు ఒక మిత్రుడు ఉండేవాడు. అతని పేరు శ్రీరాములు. ఆయన చెప్పేవాడట "నేను గాయత్రీ మంత్రం జపిస్తూ వుంటాను. నాకు గాయత్రి దేవి కనపడింది. నువ్వు కూడా అలా చెయ్యి " అని. ఆ మిత్రుడు చెప్పాడని గాయత్రీ మంత్రం జపిస్తూ వుండేవారు. "చాలా శ్రోత్రీయ బ్రాహ్మణుడిగా తయారైనాను.జుట్టు చిన్నముడి వేసేవాడిని. మిగతా అంతా గొరిగించేసి, బావి దగ్గర నీళ్ళతో స్నానం చేసి,

మడి కట్టుకొని ఆ చిన్న గుడిదగ్గర కూర్చొని, గాయత్రీ మంత్రం జపించేవాడిని."అని రాసుకున్నారు. అంత చిన్న వయసులోనే శోత్రీయ బ్రాహ్మణ కుటుంబం లాగ వుండడం, ఆ అలవాట్ల మూలాన, భోజనం చేసేటప్పుడు బ్రాహ్మణులు కాని వారు ఎవరైనా కనపడితే వెంటనే లేచి వెళ్లిపోయేవారట.

స్కూలుకి వెళ్ళడం ప్రారంభించారు. స్కూల్లో కూడా విపరీతంగా ఏమీ చదివేవారు కాదు. ఎందుకంటే, ఆరోగ్యం సరిగ్గా ఉండేది కాదు. అందుకని స్కూల్లో పరీక్షలు తప్పినా, పెద్దగా ఎవరూ ఆశ్చర్యపడేవారు కాదు. అలా స్కూల్లో చదువుతుండగానే, అంటే, 9 వ తరగతిలో వుండగా ఏం జరిగిందంటే... చలంగారి పెదనాన్న గారి అల్లుడు, చలం గారికి బావ వరస, అతను కాకినాడలో ఉండేవాడు. ఎందుకో తెలియదుగానీ, చలం గారికీ, అతనికీ పడేది కాదు. మొట్ట మొదటినుండే వైరుధ్యం. ఆయన ఒకసారి కాకినాడ నుంచి తెనాలి వచ్చినపుడు ఇద్దరికీ ఏదో గొడవయ్యింది. ఆ కక్షని మనసులో పెట్టుకొని, అప్పట్లో చలం చదివిన ఇంగ్లీష్ కథని తెలుగు అనువాదం చేసి, ఆ కథలోని విలన్ కి అతని బావ పేరు పెట్టి, ఒక పుస్తకం రాయడం మొదలుపెట్టారు. ఇదంతా 9 వ తరగతిలో ఉండగానే.కొ న్ని పేపర్లు రాయడం అయ్యాక "ఆంధ్ర ప్రచారణీ గ్రంథమాల "అనే సంస్థ వాళ్లకి పంపించారు. వాళ్ళు చదివి ఎవరో పెద్దాయన, గ్రాంథికంలో రాశారు. అనుకొని "మిగతావి కూడా పంపిస్తే పుస్తకం వేస్తాము"అని వుత్తరం రాశారు.

వుత్తరం అయితే, చలం గారికి అందింది గానీ, ఆ పుస్తకం పూర్తి చేసేటంతటి సామర్ధ్యం అప్పట్లో లేదు. ఏదో బావ మీద కోపం కొద్ది కొన్ని పేజీలు రాశారు అంతే. అలా రికార్డుల ప్రకారం చెప్పుకోవాలంటే...చలం గారి మొదటి రచన ఆ ఇంగ్లీష్ అనువాదం అవుతుంది. ఆ తరువాత ఆయనకు 27 సంవత్సరాలు వచ్చేవరకూ కాల్పనిక సాహిత్యాన్ని ముట్టుకోలేదు. ఈ విషయాలన్నీ తరువాత వస్తాయి. చలంగారికి స్త్రీల పట్ల ఆకర్షణా, ప్రేమా. మరోవైపు జాలీ, దయా, కరుణా. ఈ రకాలైన భావాలు ఏర్పడడానికి ఎలాంటి సంఘటనలు చిన్నప్పుడు దోహదం చేశాయంటే...స్త్రీల పట్ల జాలి కలగడానికి,వాళ్ళ అమ్మగారు పడే బాధలూ, ఇంకా కుటుంబంలో చెల్లెళ్ళూ, పెదనాన్నగారి పిల్లలూ వీళ్ళందరూ బాధలు పడడం చూశారు. అదంతా ఒకవైపు.అలాగే ఆడవాళ్లంటే ఆకర్షణ.ప్రేమ కలగడానికి కారణం ఏమిటంటే...

ఆయనకు స్కూలు వయసులో ఉండగానేకలిగిన కొన్ని ప్రేమ కథలు. మూడు ప్రేమ కథలు జరిగాయి. మొదటిది "బంగారమ్మ"అని ఒకమెతో ప్రేమలో పడ్డారు. కానీ, అది ' ప్రేమ' అని కూడా ఆయనకు తెలీదు. ఇవన్నీ ఆయన ఇంకా హైస్కూలు దాటక ముందే.

వాళ్ళింట్లో రవివర్మ గీసిన లక్ష్మీ దేవి బొమ్మ ఒకటి వుండేది. ఆ బొమ్మను చూడగానే ఆయనకు మనశ్శాంతి, ప్రశాంతత కలుగుతూ వుండేది. అలాంటి భావం 'బంగారమ్మ' చూసినపుడు కలిగిందట. ఆమె మీద తనకు వున్నది ' ప్రేమ' అని కూడా తెలుసుకోలేని వయసు. అప్పటికి చలం గారి వయసు 8 సంవత్సరాలు. ఆ బంగారమ్మ వయసు 20 సంవత్సరాలు.ఏదో చిన్నపిల్లాడు కదాని దగ్గరకు తీసుకుండేది. ఈయనకి మాత్రం ఏదో ఆకర్షణగా వుండేది. అదేమిటో తెలియదు. ఆయన చెప్పలేదు.ఆమెకీ తెలీదు. ఆ విధంగా ప్రేమంటే ఏమిటో తెలియని వయసు లోనే ఆడవాళ్లంటే 'ప్రేమ' మొదలయ్యింది.

రెండో అమ్మాయి. కాస్త దగ్గరైన ఈ అమ్మాయి పేరు "సుందరమ్మ"స్కూల్లోనే చదువుకునేది. ఇద్దరూ కలసి ఏ దేవాలయం దగ్గరకో వెళ్లి కబుర్లు చెప్పుకునేవారు. వాళ్ళిద్దరి పేర్లూ 'సుందరమ్మా, చలం' అని స్కూలు గోడలమీద కూడా రాశారు. అవన్నీ చూసి ఆ సుందరమ్మ ఇంట్లో వాళ్ళు ఆమెను స్కూలు మానిపించేశారు. దాంతో రోజూ సాయంత్రాలు కబుర్లు చెప్పుకునే స్నేహితురాలు లేదు అని , చలం గారు ఎలాగైనా ఆ అమ్మాయిని కలుసుకోవాలని, వాళ్ళ ఇంటికి రాయబారం పంపించదానికి నిర్ణయించుకున్నాడు .ఇదంతా 12, 13 సంవత్సరాల వయసులోనే. అయితే, ఎవరు వెళతారు.తను వెళ్తే, గుర్తుపడతారు. ఆ స్కూలుకి కొత్తగా వచ్చిన మిత్రుడు "విష్ణుభొట్ల సుబ్రహ్మణ్యం"అని తెనాలికి కొత్తగా వచ్చిన తాసిల్దారు గారి అబ్బాయిని పట్టుకొని, అతన్ని కూడా తన జట్టు చేర్చుకున్నాడు. ఆ సుబ్రహ్మణ్యాన్నిపిలిచి, "సుందరమ్మను స్కూలు మానిపించేశారు. నువ్వెళ్ళి పిలుచుకురా! నాకు చూడాలనివుంది."అన్నారు. "వాళ్ళ ఇల్లు ఎక్కడో నాకు తెలీదు" అని అతను అంటే, "సరే! నేను చూపిస్తాను పద"అని చెప్పి, ఆ సుందరమ్మ ఇంటికి కాస్త దూరంలో నిలుచుని, ఆ సుబ్రమణ్యాన్ని పంపించారు. ఆ ఇంటికి వెళ్ళిన సుబ్రమణ్యాన్ని అడిగారు."ఏరా!అబ్బాయ్! ఏంటి పని?"అని. "సుందరమ్మ కోసం వచ్చాను."అన్నాడు."సుందరమ్మతో నీకేం పని? ఇలా లోనికి రా! నువ్వు గుడిపాటి వారి అబ్బాయి వేనా?" అన్నారు. "కాదు మొర్రో" అని అంటున్నా వినిపించు కోకుండా వీర బాదుడు బాదారు. ఏడుస్తూ బయటకు వచ్చి, "నీ మూలంగా నేను తన్నులు తిన్నాను" అన్నాడు. ఇలా హైస్కూలులో పరిచయం అయిన సుబ్రహ్మణ్యం దాదాపు జీవితాంతం చలంగారికి మిత్రుడు గానే వున్నాడు. తరువాత కాలంలో గుంటూరులో లాయరు అయ్యాడు. చలంగారి ఆస్తి అంతా కూడా, అడిగిన వాళ్ళకీ, ఎవరికి బడితే ఇచ్చేస్తూ వుంటే, ఈ లాయరుగా వున్న సుబ్రహ్మణ్యమే చలం గారికి సహాయం చేయడానికి ప్రయత్నించాడు. ఈ సుబ్రహ్మణ్యం, చిట్టచివరలో అంటే, చలంగారు అరుణాచలం లో వున్న రోజుల్లో అక్కడకు వెళ్లి చలం గారితో చెప్పాడట " ఏం రా! చలం! ఈ విగ్రహాలూ, పూజలూ ఉత్త నాన్సెన్స్

అన్నావు. మేం నిజమేనని అనుకున్నాం.తరువాత అసలు మతమే మూర్ఖం. దేవుడు లేదు అన్నావు. మేం అలాగే అనుకున్నాం.ఆ తరువాత స్త్రీ తప్పు ఏమీలేదు అన్నావు. అదీ నమ్మాం.ఇప్పుడేమో అదీ లేదు.ఇదీ లేదు. ఈశ్వరుడు అంటున్నావు. అదీ ఒప్పుకున్నాం.ఇక్కడితో ఆగిపోతావా?ఇంకెక్కడికైనా వెళ్ళిపోతావా?"అని అడిగాడట.

అయితే, చలం గారికి ఆ సుందరమ్మని కలుసుకునే అవకాశం మళ్ళీ రాలేదు. కాకపోతే, ఆ ప్రేమని మాత్రం మరచిపోలేదు. చిన్నతనంలో కలిగిన అనుభవం మనసు మీద యెంత గాఢంగా ముద్ర వేస్తుంది అనడానికి ఆయన మ్యూజింగ్స్ లోనూ, ప్రేమ లేఖల్లోనూ అనేక ప్రదేశాల్లో చాలా చోట్ల గుర్తు చేసుకున్నారు. ఈ సుందరమ్మ గురించి ఏం రాసుకున్నారంటే...

"సన్నని చంద్ర కాంతిలో ఆడుతున్న పిల్లల గుంపుల్ని వెతుక్కుంటూ వెళుతున్నాను. సన్నని ఒళ్ళూ, చెంపా, విశాలమైన కళ్ళూ, సూది ముక్కూ, వెన్నెలను మింగే జడా, గాలిలో కొట్టుకు పోతున్నట్లు పరిగెత్తే ప్రియురాలిలా కనబడ్డది. తన వంక చూడదు. పిల్లలతో కేక వేస్తుంది. నవ్వుతుంది. దూరంగా పరిగెత్తి, దగ్గరగా రాసుకొంటూ పోతుంది. ఈ చంచలమే కదా! ఈ నాన్ డిపెండ బులిటీ వేరేబుల్ క్వాలిటియే కదూ, స్త్రీ మీద పురుష ఆగ్రహాన్ని గుమ్మరింప జేసింది. కానీ, ఈ ఆటనే, ముందు నిముషం ఏం చేస్తుందో..యెట్లా మారుతుందో.. తెలీని ఈ మిస్టరీ యే లేకపోతే, స్త్రీ యెంత అన్ ఇంటరెస్టింగ్ గేమ్, ఇండిపెండెంట్ వ్యక్తి అయివుండును. సుందరమ్మా, తానూ కలుసుకోవడం, ప్రేమించు కోవడం యెట్లా తటస్థ పడ్డాయి. ఎందుకు వెర్రి కలలు కన్నారో, విద్యకీ, కులానికీ ఎదురీదాలనీ ఎందుకు సాహసించారో, సుందరమ్మా! ఇంక నీ స్నేహం అసంభవమని రూఢీ పడ్డా, ఆ రాత్రి చైనా దీపం కింద కొత్త పందిట్లో నువ్వు చూసిన చూపు ఎందుకో, సముద్రం అర్ధరాత్రి, అర్ధ చంద్రుడు ఉదయించి నపుడల్లా జ్ఞాపకం వస్తుంది. సంవత్సరం అంతా నిన్ను మరచిపోయినా అట్ల తద్ది రాత్రి తెల్లర గట్ల పిల్లలు కేకవేసే సమయాన "మరచిపోయేవా?" అని జాలిగా పలకరించి నట్లుంటుంది."అని రాసుకున్నారు ఈ సుందరమ్మ గురించి.

ఇక మూడవ ఆమె "చి" అని రాశారు. తరువాత పేరు రాయలేదు. "చింతామణీ, చిత్రా"అలా ఏదైనా కావచ్చు. ఆ 'చి' కూడా మనసుని ఎంతగానో ఆకర్షించింది. "ఆమెను కూడా నేను చేరుకోలేక పోయాను." అని రాసుకున్నారు. అప్పుడు అతనికి వివాహం చేసుకునే వయసు కూడా కాదు. వివాహం చేసుకోవాలనే ఆలోచన కూడా వచ్చే వయసు కాదు. కాకపొతే ఆ పిల్లల మీద వున్న ఆకర్షణ తరువాత రోజుల్లో తెలిసింది. అది గాఢమైన ' ప్రేమ 'అని. ఒక బంగారమ్మా, ఒక సుందరమ్మా, ఒక 'చి'. ఇవేమీ పెద్దవాళ్ళకు తెలీవు. ఇతను ఏదో స్కూలుకి వెళ్లి వస్తున్నాడు.వీళ్ళ ఇల్లు కూడా పెద్దదిగా వుండేది కాబట్టి, ఇంటికి ఆడపిల్లలు

వస్తుండేవారు. ఏదో పిల్లలు ఆడుకుంటున్నారు అనుకునేవారు. వాళ్ళు సహజం గానే చలంగారికి వివాహం చేయడానికి పూనుకున్నారు. ఎందుకంటే అప్పట్లో చిన్నతనంలోనే వివాహం చేసేసే వాళ్ళు. ఆయన 'వివాహం వద్దు' అని పట్టుపట్టారు. దానికి రెండు కారణాలున్నాయి.

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 ఫిబ్రవరి 18 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS

కౌముది